## క్లుప్తంగా

### నేడు మహా అన్నదానం

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు నిడిగట్టు పరిధి రామయోగి అగ్రహారంలో గల శ్రీ సద్గురు సేవాశ్రమం 14వ వార్షికోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం మహా అన్నదానం నిర్వహించనున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపక నిర్వాహకులు యోగారాజు ఓ ప్రకటనలో తెలిపారు. భక్తులంతా తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించాలని కోరారు.

### ప్రధానోపాధ్యాయురాలు మృతి


నడుంపల్లి మెహరా

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు నడుంపల్లి మెహరా అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. 2021 సంవత్సరంలో ఈ పాఠశాలకు ప్రధానోపాధ్యాయురాలుగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుంచి విద్యార్థుల క్రమశిక్షణ, పాఠశాల అభివృద్ధికి నిరంతరం కృషి చేశారు. ప్రస్తుతం ఆమె కుటుంబంతో కలిసి చేపలుప్పాడలో నివసిస్తున్నారు. ఆమె మృతికి ఎంఈవో జయప్రద, కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, ఉపాధ్యాయ సంఘం సభ్యులు సంతాపం తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


శ్రీనివాసరావు (ఫైల్)

భీమునిపట్నం: భీమిలి కృష్ణాకాలనీ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానిక మంగల వీధికి చెందిన ఏనుగుతల శ్రీనివాసరావు(54) విశాఖలోని ఓ సెలూన్‌లో పని చేస్తున్నాడు. ఇతను ద్విచక్ర వాహనంపై విశాఖ నుంచి వస్తుండగా అదుపు తప్పి పడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్ఐ పైడిరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### వేంకటేశ్వర స్వామి సన్నిధిలో అన్నదానం


అన్నదానం చేస్తున్న టి.నగరపాలెం వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు

తగరపువలస : భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ కుటుంబ సభ్యులు శనివారం వేంకటేశ్వర మెట్టపై శ్రీవారి సన్నిధిలో అన్నదానం చేశారు. శ్రీనివాసునికి ఇష్టమైన వైశాఖ మాసం సందర్భంగా ఈ అన్నదానం చేసినట్టు తెలిపారు. వందలాది మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి, చంద్రశేఖర్, మధు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### హుండీ ఆదాయం రూ.1.41 లక్షలు


నీలమ్మ వేపచెట్టు అమ్మవారి హుండీల ఆదాయం లెక్కిస్తున్న అధికారులు

అల్లిపురం : అస్సాంగార్డెన్స్‌లోని నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం హుండీ ఆదాయం ద్వారా 1 లక్ష 41 వేల 224 రూపాయలు లభించినట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు. ఈ మొత్తం రెండు నెలలకుగాను లభించిందన్నారు. శనివారం దేవాలయం ఆవరణలో దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ పీఎల్ఎన్ రాజు సమక్షంలో హుండీలు లెక్కించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకుడు జోగారావుశర్మ, శ్రీ హరి సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



# జీడి దిగుబడి ఢమాల్!

- నాగమయ్యపాలెం అటవీ శాఖ పరిధిలో 580 ఎకరాల్లో తోటలు
- కాలుష్యమే కారణమని నిర్ధారించిన అధికారులు
- నిరాశలో వన సంరక్షణ సమితి సభ్యులు


సస్యరక్షణ లేక పలుచబడిన జీడిచెట్లు


పూతలేకుండా పసుపుబారిన జీడిచెట్ల ఆకులు


నాగమయ్యపాలెం అటవీ ప్రాంతం రహదారికి ఇరువైపులా జీడితోటలు

తగరపువలస : భీమిలి మండలం నాగమయ్యపాలెం అటవీ శాఖ పరిధిలో 580 ఎకరాల్లో విస్తరించిన జీడితోటల ద్వారా కోవిడ్‌కు ముందు సంవత్సరాల్లో వేలం ద్వారా ఏటా రూ.15 లక్షల నుంచి రూ.16 లక్షల ఆదాయం వచ్చేది. అప్పట్లో దిగుబడి 20 నుంచి 30 టన్నులు వచ్చేది. టన్ను పిక్కలు రూ.65 వేల నుంచి రూ.80 వేలకు విక్రయించేవారు. ఈ ఆదాయాన్ని తోటలను సంరక్షించే స్థానిక వన సంరక్షణ సమితి, అటవీశాఖ చెరో సగం పంచుకునేవి. వన సంరక్షణ సమితిలోని 250 మంది సభ్యులకు ఈ ఆదాయం పంచేవారు. లేదా గ్రామాభివృద్ధికి వినియోగించేవారు. ప్రస్తుతం ఇక్కడి జీడి తోటల్లో పరిస్థితులు తారుమారయ్యాయి. ఆరేళ్లుగా దిగుబడి తగ్గడంతో వేలందారులకు వరుసగా నష్టాలు వస్తుండటంతో తోటల వైపు చూడడం మానేశారు. ఈ ఏడాది ప్రారంభంలో అటవీశాఖ వేలం నిర్వహించగా రూ.5.60 లక్షల వద్ద పలకగా ఆపేసి మరోమారు నిర్వహించారు. ఈసారి రూ.2 లక్షలే రావడంతో పాటను నిలిపేసి వన సంరక్షణ సమితి సభ్యులే సొంతంగా పిక్కలు ఏరుకుంటున్నారు. ప్రస్తుతం టన్ను పిక్కలు రూ.10 వేలు ఉన్నా దిగుబడి 5 – 6 టన్నులకు మించకపోవచ్చని అంటున్నారు. అక్కడక్కడ ఉంటున్న పిక్కలను ఏరడానికి సభ్యులకు తలప్రాణం తోకకు వచ్చినట్టవుతోంది. 7 కిలోల బకెట్ పిక్కలు ఏరడానికి ఒక్కొక్కరికి ఒక రోజు పడుతోంది. అందుకుగాను బకెట్‌కు రూ.350 వంతున కూలి చెల్లిస్తున్నారు.

రోజుకు పది మంది కూలీలు పిక్కలు ఏరుతుండగా వారికి కూలి ఖర్చులకే ఇప్పటి వరకు రూ.1.80 లక్షలు దాటిపోయాయి. ఇదిలా ఉండగా వేలం నిర్వహించని కారణంగా బయటి వ్యక్తులు దొడ్డిదారిన ఎవరికి దొరికిన పిక్కలు వాళ్లు ఏరుకుని వెళ్లిపోతున్నారు.

**కళ్లు తెరిచిన అటవీశాఖ**

ఏడాదికేడాది జీడి దిగుబడి తగ్గిపోవడం, వేలానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో కారణాలపై అటవీశాఖ దృష్టి సారించింది. ఇటీవల నాగమయ్యపాలెంలోని తోటలను పరిశీలించగా ఎక్కడికక్కడ పూత మాడిపోయినట్టు గుర్తించారు. సమీపంలోని ఫార్మా కంపెనీ మూడో యూనిట్ ప్రారంభించడమే కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. చెట్ల కొమ్మలు ఎండిపోవడం, ఆకులు పాలిపోవడానికి కాలుష్యమే కారణమని నిర్ధారణకు వచ్చారు. మాడిపోయిన పూత శాంపిళ్లను తీసుకెళ్లారు. వచ్చేవారం మరోమారు తోటలను పరిశీలించనున్నారు.


చెట్టుకే మాడిపోయిన పూత


కొద్ది మొత్తంలో లభించిన జీడిపిక్కలు

### 2021 నుంచి వరుస నష్టాలు..



2021 నుంచి వరుస నష్టాలు వస్తున్నాయి. గతేడాది రూ.7.30 లక్షలకు మేమే వేలంలో తీసుకుంటే రూ.1.30 లక్షల నష్టం వచ్చింది. అయిదేళ్లుగా వన సంరక్షణ సమితికి అటవీ శాఖ నుంచి రూ.28 లక్షల బకాయిలు ఉండిపోయాయి. అవి రాకపోవడంతో తోటి సభ్యులైన మత్స్యకారులకు వలలు, కుట్టు పడవలకు డబ్బులు అదించలేకపోతున్నాం. – చెల్లిపల్లి సత్తిరాజు, అధ్యక్షుడు, వన సంరక్షణ సమితి

### కాలుష్యమే కారణం



చాలా చోట్ల జీడి, మామిడి దిగుబడులకు అధిక మంచు, పురుగు, వర్షాభావ పరిస్థితులు కారణం కావచ్చు. మా దగ్గర మాత్రం ఖచ్చితంగా కాలుష్యమే కారణం. దీనిని అటవీశాఖ ఇప్పటికే గుర్తించింది. ప్రత్యమ్నాయంగా దిగుబడి పెంచడానికి ఏం చర్యలు తీసుకుంటారో చూడాలి. – గరికిన ఎల్లయ్య

### స్వయం ఉపాధికి దెబ్బ..



జీడి ఫలసాయం బాగున్నప్పుడు వచ్చే ఆదాయంతో వన సంరక్షణ సమితి ద్వారా గ్రామంలో స్వయం ఉపాధికి అవకాశం ఉండేది. హుద్‌హుద్‌కు కొన్ని చెట్లు తుడిచిపెట్టుకుపోయాయి. ఐదేళ్లుగా ఆదాయం తగ్గిపోయింది. మాకు మేము సహాయ పడలేకపోతున్నాం. – మైలపల్లి ధనరాజు

### అధ్వానంగా ఉప్పు గల్లీల రహదారి


రాళ్లు తేలిన ఉప్పు గల్లీల రహదారి

తగరపువలస : భీమిలి మండలం కొత్త మూలకుద్దు ఉప్పు గల్లీల రహదారి రాళ్లు తేలి అధ్వానంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని ఉప్పు సాగుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిల్లపేట – మూలకుద్దు బీటీ రోడ్డు నుంచి ఉప్పు గల్లీల వరకు 300 మీటర్ల మేరకు ఈ రహదారి అధ్వానంగా మారింది. ఈ మార్గంలో నడిచి వెళ్లేవారు, ద్విచక్ర వాహనాలపై వచ్చేవారు పలు ఒడిదుడుకులకు లోనవుతున్నారు. అంతేకాకుండా ఈ మార్గానికి ఇరువైపులా తుమ్మ చెట్లు కమ్మేయడంతో రహదారిపై రాళ్లతోపాటు ముళ్లు ఉప్పు సాగుదారులకు తరచూ సమస్యగా మారుతున్నాయి. ఈ మార్గాన్ని ఆధునికీకరించడానికి ఎవరూ ముందుకు రావడం లేదని వాపోతున్నారు. రహదారితోపాటు ఉప్పుటేరు నుంచి గల్లీలకు నీరు సరఫరాకు శిథిలమైన డ్రైనేజీలు, మదుములకు మరమ్మతులు చేయించాలని సాగుదారులు కోరుతున్నారు. మూలకుద్దు ప్రాంతంలో ఉప్పు సాగవుతుందన్న విషయం ఈ ప్రాంతవాసులకు సరిగ్గా తెలియదని అంటున్నారు. గల్లీలకు చక్కటి రహదారి ఏర్పాటు చేస్తే పర్యాటకులు వచ్చేందుకు అవకాశం ఉంటుందంటున్నారు.

### 'శశి' విద్యార్థులకు ర్యాంకులు

తగరపువలస : శనివారం ప్రకటించిన తెలంగాణ ఈఏపీసెట్‌లో సంగివలస శశి విద్యార్థులకు అత్యుత్తమ ర్యాంకులు లభించాయి. ఫార్మసీ విభాగంలో ఫణికి 83, కె.తనీష్ షణ్ముఖ శ్రీసాయికి 120వ ర్యాంకులు లభించినట్టు వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వీరిని ఆయన అభినందించారు.

## కుంతీ మాధవ స్వామి చందనోత్సవం నేడు


కుంతీ మాధవ స్వామి విగ్రహం


మామిడి తోరణాలతో అలంకరించిన ఆలయ లోపలి భాగం

పద్మనాభం : పద్మనాభంలో వెలసిన కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఆదివారం చందనోత్సవం నిర్వహణకు ఆలయ అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కుంతీ మాధవ స్వామిని అలంకరించడానికి అవసరమయ్యే చందనాన్ని సమకూర్చారు. కుంతీ మాధవ స్వామిని శనివారం రాత్రి పది గంటలకు ఆలయ అర్చక స్వాములు చందనంతో అలంకరిస్తారు. ఆదివారం ఉదయం ముందుగా విశ్వక్షేన పూజ, పుణ్యాహవచనం నిర్వహిస్తారు. అనంతరం ఏడు గంటల నుంచి చందనం అలంకరణలో ఉన్న స్వామిని దర్శించుకోవడానికి భక్తులకు ప్రవేశం కల్పిస్తారు. రెండు రోజుల వరకు కుంతీ మాధవ స్వామి చందనం అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. ఆలయ లోపలి భాగాన్ని, రాజగోపురం ముందు భాగాన్ని మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. కుంతీ మాధవ స్వామి ఆలయం ముందు భాగంలో అరటి చెట్లతో అలంకరించారు.

### విశాలాక్షినగర్ బీవీకేలో ప్రవేశాలు ప్రారంభం

ఆరిలోవ : జీవీఎంసీ 9వ వార్డు పరిధి విశాలాక్షినగర్‌లోని బీవీకే జూనియర్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరానికి ప్రవేశాలు ప్రారంభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎ.రమ శనివారం విలేకరులకు తెలిపారు. కళాశాలలో విశాలమైన క్రీడా మైదానం, లేబొరేటరీ, గ్రంథాలయం, మెరుగైన విద్యా ప్రమాణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇక్కడ ఎంపీసీ, ఎంఈసీ, సీఈసీ, మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు.

## 160 మందికి కంటి వైద్య పరీక్షలు

తగరపువలస : వెంపాడ వెల్ఫేర్ సొసైటీ, భీమిలి నీడీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సంయుక్తంగా శనివారం రామన్నపేట సాయిరవీంద్ర పాఠశాలలో నిర్వహించిన మెగా కంటి వైద్య శిబిరంలో సిబ్బంది 160 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 40 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో ఉచితంగా వీరికి శస్త్ర చికిత్సలు చేయనున్నారు. కళ్ల జోళ్లు అవసరమైన వారికి ఉచితంగా అందిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాస రెడ్డి, కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్, డాక్టర్ గంగాధర్, క్యాంప్ కో ఆర్డినేటర్ వై.పైడిరాజు, సిబ్బంది ఉష, పవిత్ర, తదితరులు పాల్గొన్నారు.


రామన్నపేటలో రోగులను పరీక్షిస్తున్న సిబ్బంది

## అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సంకల్పం, కంణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశేషంగా హారతులు అందజేశారు.

**ఘనంగా సహస్రనామార్చన**

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం సహస్రనామార్చన ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టంపజేసి1001 నామాలను పఠిస్తూ స్వామికి తులసితో అర్చన చేశారు.

## ఘనంగా కన్యకా పరమేశ్వరి జయంత్యుత్సవం


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


వైఎస్సార్ కాలనీ వద్ద కన్యకా పరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


కన్యకా పరమేశ్వరి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

భీమునిపట్నం : భీమిలిలోని ఆర్యవైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జయంతోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం విశేష పూజలతో పాటు సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఆలయ సంఘం అధ్యక్షుడు బొండా నర్శింహమూర్తి పాల్గొన్నారు.

**వాసవీ మాతకు ప్రత్యేక పూజలు**

మధురవాడ : జీవీఎంసీ 5వ వార్డు కొమ్మాది జంక్షన్ వైఎస్సార్ కాలనీ వద్ద గల వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు శనివారం నిర్వహించారు. ముందుగా అమ్మవారికి పంచామృత, సుగంధ అభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేషంగా అలంకరించి గణపతి, శాంతి హోమాలు నిర్వహించారు. మధురవాడ పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు తరలివచ్చి కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు, కళింగ వైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదం స్వీకరించారు.

## కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన


తులసీదళార్చనలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. సహస్ర తులసీదళార్చనలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చని ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## పరిపాలన విభాగాల పరిశీలన


కార్యాలయాలు పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్

ఏయూ క్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలోని పలు విభాగాలను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ శనివారం పరిశీలించారు. పరిపాలన భవనంలో పనిచేస్తున్న విభాగాలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. కార్యాలయాల ఆధునికీకరణ, అవసరమైన మార్పులు చేపట్టడం, మరమ్మతులు, తదితర అంశాలపై సిబ్బంది సూచనలు స్వీకరించారు. ప్రతీ విభాగాన్ని పూర్తి స్థాయిలో ఆధునికీకరించడం, విద్యార్థులకు, ఉద్యోగులకు మరింత సమర్థంగా సేవలు అందించడం లక్ష్యంగా పని చేయాలని సూచించారు. రిజిస్ట్రార్ వెంట అధికారులు సాంబమూర్తి, గోపాల కృష్ణ, రమణా రెడ్డి, తులసీరామ్, ఇమాన్ ఉన్నారు.

## కల్యాణం.. కమనీయం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు


పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి


శ్రీవారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

- వైభవంగా శ్రీవారి కల్యాణం
- వెంకటాద్రికి పోటెత్తిన భక్తులు

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువైన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం శ్రీవారి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ముందుగా స్వామివారికి సుప్రభాత సేవ, విశేష పూజలు జరిపారు. సాయంత్రం గోదా, పద్మావతి సమేత స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్తి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీవారి కల్యాణాన్ని కనులారా తిలకించారు. ఈవో నీలిమ ఆధ్వర్యంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు ఆదివారం సాయంత్రం తిరువీధి ఉత్సవంలో భాగంగా స్వామివారి రథోత్సవం సాగనుంది. వెంకటాద్రి నుంచి పెందుర్తి పురవీధుల్లో స్వామివారు రథంపై పయనిస్తూ చినముషిడివాడ సప్తగిరి నగర్‌లోని అలివేలు మంగమ్మ సన్నిధి వరకు భక్తులకు ఆశీస్సులు అందిస్తారు. ఆఖరి రోజు సోమవారం ఉదయం స్వామివారికి చక్రస్నానం, చక్రత్తాళ్వారులతో కలిసి దివ్య స్నానమాచరిస్తారు. సాయంత్రం పుష్పయాగం, మహా పూర్ణాహుతి, ద్వాదశారాధన, స్వామివారికి విశేష అర్చనలు, ఊంజల్ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని ఆలయ ప్రతినిధులు వెల్లడించారు.

### ఎంఈఎస్ సివిలియన్ ఇంజినీర్ల సమస్యలు పరిష్కరించాలి

సీతంపేట: ఎంఈఎస్‌లో పనిచేస్తున్న సివిలియన్ ఇంజినీర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపి తమకు రావాల్సిన బెనిఫిట్స్‌ను ఎటువంటి వివక్ష లేకుండా అమలు చేయాలని ఆల్ ఇండియా సివిలియన్ ఇంజినీర్స్ అసోసియేషన్ కోరింది. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం సంఘ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కె.రాధాకృష్ణ, సంజీవ్ సుమన్ మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం తమకు ఏఈ నుంచి ఈఈ క్యాడర్ వరకు ప్రమోషన్ ఇచ్చేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. 124 మంది పదోన్నతులు పొందారని చెప్పారు. సర్వేయర్లకు ఇంజినీరింగ్‌తో అనుసంధానం చేస్తూ వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. గ్రేడ్ పే మొత్తాన్ని పెంచాలని, సివిలియన్లకు టైప్ 3, 4 క్వార్టర్లు నిర్మించాలని కోరారు. సంఘ ఉపాధ్యక్షులు చతుర్వేది, నితీష్‌కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.